క్లుప్తంగా

బైక్ అద్దాల ధ్వంసంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తిపై దాడికి యత్నించడంతో పాటు బైక్ అద్దాలను ధ్వంసం చేసిన ఘటనపై సంతపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాలు..కపాడిపాళెనికి చెందిన ఎం శాంతిస్వరూప్ కలెక్టర్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఈ నెల 15న రాత్రి కార్యాలయం నుంచి బైక్‌పై ఇంటికి బయల్దేరారు. కపాడిపాళెం ఆర్చి రోడ్ వద్దకు వచ్చేసరికి అదే ప్రాంతానికి చెందిన హనోక్ మద్యం మత్తులో అడ్డగించి గొడవకు దిగాడు. బైక్ అద్దాలు పగులగొట్టాడు. అనంతరం కత్తితో దాడికి యత్నిస్తుండగా శాంతిస్వరూప్ పెద్దగా కేకలు వేశాడు. స్థానికులు రావడాన్ని గమనించి నిందితుడు పరారయ్యాడు. ఆదివారం బాధితుడు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఐఎన్‌టీయూసీ) జిల్లా అధ్యక్షుడిగా వీ చంద్రశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూ రు దేవకుమార్‌రెడ్డి నియామక ఉత్తర్వులను ఆదివారం జారీ చేశారు. గతంలో జిల్లా జనరల్ సెక్రటరీగా పనిచేసిన చంద్రశేఖర్‌రెడ్డిని జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. తనపై నమ్మకం ఉంచి పదవీ బాధ్యతలు అప్పగించిన దేవకుమార్‌రెడ్డికి చంద్రశేఖరరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో యూనియన్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

జీతాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి



నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయ, ఉద్యోగుల జీతాల చెల్లింపులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి కోరారు. నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భారీగా ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నా ప్రభుత్వం భర్తీ చేయడం లేదన్నారు. తనకు ఓటేస్తే ఉపాధ్యాయులు, పెన్షనర్లు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జనార్దన్‌రెడ్డికాలనీలోని శ్రీవాణి స్కూల్‌లోని 1 నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు ఆదివారం స్పెల్‌బీ- 2023 పోటీలు నిర్వహించారు. విజేతలకు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ షేక్ సఫియా చేతుల మీదుగా సర్టిఫికెట్లు, మెమెంటోలు ప్రదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ముజీర్, పాఠశాల కరస్పాండెంట్ విజయ్, హెచ్‌ఎం రాజేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

మానసిక రోగికి తీవ్రగాయాలు



మనుబోలు : మానసిక రోగి తన తలను రోడ్డుకేసి బాదుకోవడంతో తీవ్ర గాయాలైన ఘటన మనుబోలు పరిధిలోని జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తి హైవేపైకి చేరుకుని రోడ్డుకు బాదుకుంటూ రక్తగాయాలై పడిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతన్ని చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తిపై కత్తితో దాడి

వెంకటాచలం : ఓ దుకాణం వద్ద తలెత్తిన వివాదం కారణంగా మండలంలోని కాకుటూరు గ్రామానికి చెందిన మహేష్‌పై అదే గ్రామానికి చెందిన పచ్చబట్ల సాయి కత్తితో దాడికి పాల్పడిన ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. మహేష్, పచ్చబట్ల సాయి గొలగమూడి వద్ద ఉన్న ఓ దుకాణం వద్దకు స్నేహితులతో కలిసి వెళ్లారు. అక్కడ ఇరువురి మధ్యన చిన్న వివాదం నెలకొనడంతో ఇద్దరూ కాకుటూరు గ్రామానికి తిరిగి వచ్చారు. ఈ నేపథ్యంలో కాకుటూరులో ఇద్దరూ మరోసారి గొడవ పడ్డారు. ఈ క్రమంలో మహేష్‌పై సాయి కత్తితో దాడి చేసి పరారయ్యాడు. గాయపడిన మహేష్‌ను కుటుంబసభ్యులు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కమనీయం..రమణీయం



కోదూరుపాడులో నీలకంఠేశ్వరుని కల్యాణం

నెల్లూరు రూరల్: మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా కోదూరుపాడులోని గంగాపార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదిదంపతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేత కోడూరు కమలాకర్‌రెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వైభవంగా నాగేశ్వరస్వామి కల్యాణం

నెల్లూరు(బృందావనం): సుజాతమ్మకాలనీలోని శ్రీకృష్ణ యోగ మందిర ప్రాంగణంలోని ఉమాదేవి సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో నాగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా అవధూత దత్తపీఠం నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో ఉదయం నాగేశ్వరస్వామి, ఉమాదేవిని విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. రాత్రి పల్లకీసేవ వేడుకగా జరిపారు. శ్రీగణపతి సచ్చిదానంద కృష్ణజ్ఞానబోధ సభ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కనులపండువగా శివపార్వతుల కల్యాణం

మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా వైకుంఠపురంలోని కాశీనాయన ఆశ్రమంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం కనులపండువగా నిర్వహించారు. జిల్లా బ్రాహ్మణ సంఘ కార్యదర్శి మువ్వ ప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో శివపార్వతులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు ధన్వి శ్రీనివాస్, మహంకాళి వెంకటేష్, నవీన్, సాంబశివరావు, మహేష్, నాగూరు, శివ ,గణేష్, మదన్, దిలీప్, హరిబాబు, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భవానీశంకరుడికి విశేష పూజలు

వేదాయపాళెంలోని మహాత్మాగాంధీనగర్ శ్రీకృష్ణ మందిరం ప్రాంగణంలో కొలువైన భవానీశంకర స్వామి సన్నిధిలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



కాశీనాయన ఆశ్రమంలో శివపార్వతుల కల్యాణం



విశేషాలంకారంలో ఉమాదేవి,నాగేశ్వరస్వామి



మహాత్మాగాంధీనగర్ శ్రీకృష్ణ మందిరంలో..

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పదన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బుఖారి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎస్‌డీపీఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహ్మద్‌గని నేతృత్వంలో వెంకటేశ్వరపురంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 53,54 డివిజన్లకు చెందిన సుమారు 200 మందికి పైగా రోగులకు నగరానికి చెందిన ప్రముఖ వైద్యనిపుణులు అన్వేష్ గట్టు, నౌషాద్‌అలీ, హారిక భీమా, సందానీ వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎస్‌డీపీఐ జిల్లా నాయకులు రఫీ, హుస్సేన్, పల్లిపాడు గాంధీఆశ్రమ కమిటీ సభ్యుడు అల్లాభక్షు, ఫైజుల్లా,'సనమీవుల్లా, తదితరులు పాల్గొన్నారు.

శాసనమండలిలో అవకాశం కల్పించాలి



విలేకరులతో మాట్లాడుతున్న రఘురాంముదిరాజ్



విలేకరులతో మాట్లాడుతున్న సలీం

నెల్లూరు(వేదాయపాళెం): రాష్ట్ర శాసన మండలిలో ముదిరాజ్‌లకు అవకాశం కల్పించాలని ముదిరాజ్ రాష్ట్ర మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ కనకట్ల రఘురాం ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. దర్గామిట్టలోని కేటీపీ హాల్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ముదిరాజ్‌లకు శాసనమండలిలో అవకాశం కల్పించారని గుర్తుచేశారు. అదే విధంగా ముదిరాజ్‌లకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. ముదిరాజ్ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, నెల్లూరులో ముదిరాజ్ విద్యార్థులకు ప్రత్యేక వసతిగృహం, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని, ముదిరాజ్ భవన్‌కు స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు గంపల అనిల్‌కుమార్, ఉద్యోగుల విభాగం రాష్ట్రాధ్యక్షుడు గుద్దేటి చెంచయ్య, నగరాధ్యక్షుడు మధు, దినేష్, గోపాల్, శ్రీనివాస్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

నూర్‌బాషాలకు అవకాశం కల్పించాలి

నెల్లూరు(వేదాయపాళెం): శాసనమండలిలో నూర్‌బాషాలకు అవకాశం కల్పించాలని నూర్‌బాషా సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ సలీం కోరారు. శాంతినగర్‌లోని సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ నూర్‌బాషాలకు చట్టసభల్లో అవకాశం కల్పించలేదన్నారు. వచ్చే నెలలలో ఖాళీ అవుతున్న ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి నూర్‌బాషాలకు కేటాయించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. నూర్‌బాషా సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఖాదర్‌బాషా, బాబర్‌జాన్, మస్తాన్‌సాహెబ్, హుస్సేన్ సాహెబ్, జిల్లా గౌరవాధ్యక్షులు మహబూబ్ బాషా, మస్తాన్, లతీఫ్, మౌలాలి, మస్తాన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.


మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



అభివాదం చేస్తున్న స్వేరోస్ ప్రతినిధులు

నెల్లూరు(వేదాయపాళెం): మహనీయుల త్యాగాల స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని స్వేరోస్ మహిళా విభాగం రాష్ట్రాధ్యక్షురాలు మందల పద్మజ అన్నారు. దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో స్వేరోస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహనీయుల త్యాగాల స్ఫూర్తి సభను ఆదివారం నిర్వహించారు. తొలుత సావిత్రిబాయి పూలే, ఫాతిమా షేక్, రమాబాయి అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మందల పద్మజ మాట్లాడుతూ అక్షరం, ఆరోగ్యం, ఆర్థిక విభాగాల్లో ప్రజలు సాధికారత సాధించడం ద్వారా జ్ఞాన సమాజాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా విశ్రాంత ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్వేరోస్ పనిచేస్తోందన్నారు. అందులో భాగంగా మహనీయుల త్యాగాల స్ఫూర్తి సభలను ప్రతి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. సావిత్రిబాయి పూలే చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గూడూరు సీతామహాలక్ష్మి, పద్మావతి వర్సిటీ ప్రొఫెసర్ తవిత, రాధ, విజయకుమార్, చిట్టియ్య, సురేంద్ర, బాలకృష్ణ, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై అవగాహన



డాక్టర్ శ్రీనివాసరాజును సత్కరిస్తున్న సీనియర్ సిటిజన్స్

నెల్లూరు(బృందావనం): ఆచారివీధిలోని క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సీనియర్ సిటిజన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డాక్టర్ శ్రీనివాసరాజు ముఖ్యఅతిథిగా హాజరై గుండె వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ధూమపానం, మద్యపానం, గుట్కాలు, తదితర మత్తు పదార్థాల వాడకం ఆయుష్షును తగ్గించడంతో పాటు ఆర్థిక పతనానికి దారితీస్తాయన్నారు. వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం సీనియర్‌సిటిజన్స్ సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరాజును సీనియర్ సిటిజన్స్ ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండ్లపల్లి శ్రీధర్‌రావు, చుండూరు కృష్ణమూర్తి, కోశాధికారి అద్దేపల్లి సుబ్బారావు, కే ఆదిలక్ష్మి, మదన్‌మోహన్‌గుప్తా, చిన్ని ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు నేదురుమల్లి జయంతి వేడుకలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఇందిరాభవన్‌లో మాజీ సీఎం నేదురమల్లి జనార్దన్ రెడ్డి 88వ జయంతి వేడుకలను సోమవారం నిర్వహించనున్నట్లు ఇందిరాభవన్ ట్రస్ట్ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, నేదురమల్లి అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

సీనియర్ అసిస్టెంట్ మృతికి సంతాపం

నెల్లూరు(క్రైమ్): జిల్లా పోలీసు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీపతి జయశంకర్ శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఆయన మృతికి ఏపీ పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, రాష్ట్ర గౌరవ సలహాదారులు వై శ్రీహరి, పలువురు పోలీసు అధికారులు, పోలీసు కార్యాలయ మినిస్టీరియల్ స్టాఫ్ సంతాపం ప్రకటించారు. మృతుడి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. జయశంకర్ గతంలో పోలీసు మినీస్టీరియల్ స్టాఫ్ ఉపాధ్యక్షుడిగా, జిల్లా ఎన్జీవో సంఘంలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

బీఎస్పీ రూరల్ కన్వీనర్‌గా సాయికుమార్



నెల్లూరు రూరల్: బీఎస్పీ నెల్లూరు రూరల్ కన్వీనర్‌గా కోడూరుపాడుకు చెందిన బత్తుల సాయికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి శ్రీరామ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రూరల్ పరిధిలో బీఎస్పీ బలోపేతానికి కృషి చేస్తామని సాయికుమార్ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని డైకస్ రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు నెల్లూరు వెస్ట్-1 సెక్షన్ విద్యుత్‌శాఖ ఏఈ లక్ష్మీబాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూలాపేట మూలస్థానేశ్వరస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న సందర్భంగా రామయ్యబడి విద్యుత్ ఫీడర్‌లోని మూలస్థానేశ్వరస్వామి ఆలయ ప్రాంతం, కోనేటిమిట్ట, బ్రాహ్మణవీధి, రాజావారివీధి, అలంకార్‌సెంటర్, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జయపాల్ గెలుపునకు కృషి చేయాలి



నెల్లూరు(బారకాసు): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ తరపున పోటీచేస్తున్న జయపాల్ గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ గుర్రంకొండ సర్దార్ కోరారు. ఆదివారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తూర్పురాయల సీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయించి విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆప్ అభ్యర్థి జయపాల్, నాయకులు ఎస్‌కే ఉస్మాన్, నాగూర్, సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలను తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

- నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): గృహసారథులు, వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గడప గడపకు తీసుకెళ్లాలని నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ సూచించారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా నగరంలోని 9,10,11 డివిజన్లకు సంబంధించి నవాబుపేట షాదీమంజిల్, 13,14,15 డివిజన్లకు సంబంధించి బాలాజీనగర్‌లోని శ్రీత్యాగరాజస్వామి కల్యాణ మండపంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహసారథులు సంక్షేమ వారధుల్లా నిలవాలన్నారు. గత ప్రభుత్వానికి మన ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలకు తెలియజేయాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారని తెలిపారు. 10వ డివిజన్‌లో మల్లపుకాలువ నిర్మాణ పనులకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. డివిజన్‌లోని రోడ్ల ప్యాచ్‌వర్క్ పనులను చేపడుతామన్నారు. బాలాజీనగర్ ప్రజల కోరిక మేరకు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. బాలాజీనగర్ మినీబైపాస్‌రోడ్డు వద్ద నిర్మిస్తున్న బ్రాహ్మణ కర్మక్రతువుల భవన నిర్మాణ పనులను త్వరలో పూర్తిచేస్తామన్నారు. జేసీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ పుట్టా శివశంకర్‌రెడ్డి, కార్పొరేటర్లు కిన్నెర ప్రేమ్‌కుమార్, గోతం అరుణ, ఊటుకూరు నాగార్జున, కర్తం ప్రతాప్‌రెడ్డి, గణేశం సుజాత, 9వ డివిజన్ ఇన్‌చార్జి వంగాల శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేత్రపర్వం...శ్రీవారి కల్యాణ మహోత్సవం



మాంగళ్యాన్ని చూపుతున్న వేదపండితులు

నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత దేవదేవేరుల ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. సర్వాలంకారశోభితుడైన శ్రీవారిని భక్తులు తిలకించి పులకించిపోయారు. గోవిందనామస్మరణతో మందిరం మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఉభయకర్తలుగా కృష్ణగిరి దేశ్‌పాల్‌సింగ్,దేవకీదేవి దంపతులు వ్యవహరించారు. సీతారామస్వామి మందిర కమిటీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పార్టీ నాయకులు కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి కోరారు. రూరల్ పరిధిలోని ఉప్పుటూరులో పార్టీ నాయకులు కార్యకర్తలతో ఆదివారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. అన్ని వర్గాల వారికి తాము అండగా నిలుస్తామన్నారు. సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ నారపరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, నాయకులు శీనయ్య, దయాకర్, శ్రీనివాసులనాయుడు, సుధీర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల గానం అజరామరం



జ్యోతిప్రజ్వలన చేసిన నెల్లూరు ఆర్డీఓ మలోల

నెల్లూరు(బృందావనం): మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు గానం అజరామరమని, ఘంటసాల కీర్తి శాశ్వతమని నెల్లూరు ఆర్డీవో మలోల పేర్కొన్నారు. అమర గాయకుడు ఘంటసాల 49వ వర్ధంతిని పురస్కరించుకుని సీనియర్ గాయకుడు కోడూరు ఆనందరావు ఆధ్వర్యంలో నగరంలోని స్వతంత్ర పార్క్ ప్రాంగణంలో ఘంటసాల సంగీత విభావరిని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఘంటసాల చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. తెలుగుభాష ఉన్నంతకాలం, సంగీత, సాహిత్య ప్రపంచంలో ఘంటసాల పాటలు మణిమకుటాలుగా నిలిచిపోతాయన్నారు. ఘంటసాల గానం చేసిన భగవద్గీత నాటికి నేటికి ఏనాటికి చిరస్మరణీయమన్నారు.

గాత్రంతో అలరించిన ఆర్డీఓ

ఘంటసాల సంగీత విభావరిలో ఆర్డీఓ మలోల తన గాత్రంతో అలరించారు. ఘంటసాల గానం చేసిన ఏడు పాటలను మృధుమధురంగా గానం చేసి సభికుల హర్షధ్వానాలు అందుకున్నారు. అనంతరం సీనియర్ గాయకులు ఆనందరావు, నీలకంఠం శ్రీనివాసులురెడ్డి, షఫీ, సుజాత, పెంచలరెడ్డి, లక్ష్మి, తదితరులు ఘంటసాల గీతాలను ఆలపించారు. ప్రముఖ నాట్యగురువు గురుకృప కళాక్షేత్రం నిర్వాహకులు సురభి గాయత్రి శిష్యబృందం ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాలు, సంస్థల నిర్వాహకులు జయప్రకాష్, కృష్ణమూర్తి, విశ్వేశ్వరప్రసాద్, రమేష్, దారా సురేష్, శాంతికుమార్, రఫీ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శివతత్వాన్ని చాటిన భక్తిగీతాల పోటీలు



భక్తిగీతాల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి పర్వదినం నేపథ్యంలో సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన భక్తి గీతాలాపన పోటీలు శివతత్వాన్ని చాటుతూ మైమరిపించాయి. పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు మెట్టు రామచంద్రప్రసాద్, తాళ్లూరి రాము, బీఎస్ రాజు, డాక్టర్ వెన్నెల, డాక్టర్ కిరణ్‌కుమార్, కే విజయమ్మ, బీ మురళీకృష్ణ, వేమయ్య ఎస్ మాధవి, డీ కల్యాణి, కే వరలక్ష్మి, తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. మహాశివరాత్రి విశిష్టత, సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని వివరించారు.

బిల్డింగ్‌పై నుంచి జారిపడి యువకుడి మృతి



రిషికేశ్ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): ప్రమాదవశాత్తు ఐదో అంతస్థుపై నుంచి జారిపడి యువకుడు మృతి చెందిన ఘటన ఇరుగాళమ్మ గుడి సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.ఇరుగాళమ్మ గుడి సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో కే కల్పన కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె పోలీసు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆమె కుమారుడు వెంకట రిషికేశ్ (19) కొడవలూరులోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఆయన ఆదివారం రాత్రి వాకింగ్ చేసేందుకు అపార్ట్‌మెంట్ ఐదో అంతస్థుపైకి వెళ్లారు. వాకింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి తలకు తీవ్రగాయమైంది. గమనించిన వాచ్‌మన్ వెంటనే బాధిత తల్లికి సమాచారం అందించారు. అందరూ కలిసి వెంకట రిషికేశ్‌ను చికిత్స నిమిత్తం బొల్లినేని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. ఈ మేరకు బాధిత తల్లి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ఏ షైదులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఒక్కగానొక్క కుమారుడు మృత్యువాతపడడంతో బాధిత తల్లి గుండెలవిసేలా రోదించారు.